## క్లుప్తంగా

### అండర్ -23 సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు ఇద్దరు ఎంపిక

వాల్మీకిపురం : అండర్ -23 సౌత్‌జోన్ క్రికెట్ జట్టులో వాల్మీకిపురం సబ్ సెంటర్ క్యాంపు నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో భవానీ ప్రసాద్ (ఓపెనింగ్ బ్యాట్స్ మెన్, అనిల్ కుమార్ మీడియం పేస్ బౌలర్‌గా పాల్గొని, అక్కడ మంచి ప్రతిభ చాటుకోవడంతో సౌత్ జోన్ జట్టుకు ఎంపికై నట్లు తెలిపారు. వీరు వన్‌డే మ్యాచ్, కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### సబ్సిడీ చాప్ కట్టర్‌లను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న చాప్ కట్టర్(గడ్డి కత్తిరించే యంత్రాలు)లను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సలామ్ తెలిపారు. శనివారం మండలంలోని తరిగొండ పశువైద్య కేంద్రములో 15 మంది పాడిరైతులకు చాప్ కటర్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో వీటి ధర రూ. 33 వేలుకాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ. 20,400కే పాడిరైతులకు అందిస్తోందన్నారు.

### జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తనిఖీ

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తనిఖీ చేశారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమగ్రంగా సర్వే చేస్తున్నారా, సర్వేకు వెళ్ళిన అనంతరం వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సర్వే అనంతరం ఏఎన్ఎం, వైద్య సిబ్బంది వెళ్ళి వారి ఆరోగ్యానికి సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు.

### నూతన స్తంభాల ఏర్పాటుతో మెరుగైన విద్యుత్

పీలేరు : నూతన స్తంభాల ఏర్పాటుతో మెరుగైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించనున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బీఎస్ రోడ్డు, తదితర ప్రదేశాలలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ప్రజల నుంచి అందిన వినతుల సమస్యల పరిష్కారంలో భాగంగా మరమ్మతుకు గురైన, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తొలగించి వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### జిల్లా ఆస్పత్రిలో రక్తదానం

మదనపల్లె : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కార్యకర్తలు రక్తదానం చేశారు. భారతీయ జనతా యువమోర్చా బండిఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పాల్గొన్నారు.

### 28న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : శ్రావణపౌర్ణమి సందర్భంగా ఈనెల 28న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆరు అల్ట్రాడీలక్స్ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకోవాలన్నారు. నాలుగు టిక్కెట్లు ఉంటే వారి వద్దకే వచ్చి టిక్కెట్లు ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

### పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పీలేరు : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ రాజమ్మ అన్నారు. శనివారం మండలంలోని రేగళ్ళు సెక్టార్ లోని పెద్దిరెడ్డిగారిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పోషక ఆహారాలను సక్రమంగా వినియోగించుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

### అవయవ దానం ప్రాముఖ్యతను గుర్తించాలి

కలికిరి : అవయదాన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. సీహెచ్‌సీలో శనివారం ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మేళాలో 20 మంది అవయవ దానానికి ముందుకు వచ్చారని, వీరి వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి గుర్తింపు పత్రాలను అందజేశామన్నారు.

### అన్నదానం

మదనపల్లె : ఆర్యవైశ్య వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎల్లంపల్లె ప్రశాంత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులు, సదరం క్యాంపుకు హాజరైన దివ్యాంగులు తదితరులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఆన్‌లైన్ పేమెంట్‌పై శిక్షణ

తంబళ్లపల్లె : గ్రామ పంచాయితీ, సచివాలయాలలో పారదర్శక పాలనకే నగదు రహిత లావాదేవీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. శనివారం డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులకు ఆన్‌లైన్ పేమెంట్‌పై ఒకరోజు శిక్షణ ఇచ్చారు.

---

**ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న మెనూ**


**సోమవారం** పొంగలి, కోడిగుడ్డు, వెజ్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ.


**మంగళవారం** చిత్రాన్నం/పులిహోర, టమాటా/దొండకాయ చట్నీ, కోడిగుడ్డు


**బుధవారం** వెజిటబుల్ రైస్, ఆలుకూర్మ, కోడిగుడ్డు, చిక్కీ


**గురువారం** సాంబార్‌బాత్, కోడిగుడ్డు, చిక్కీ


**శుక్రవారం** అన్నం, పప్పు, ఆకుకూరలు కోడిగుడ్డు, చిక్కీ


**శనివారం** ఆకుకూరల కర్రి, అన్నం పప్పు, చారు. స్వీట్ పొంగల్

## ఆహా.. ఏమిరుచి..

# ఇంటి భోజనం మరిపించి..

- గత ప్రభుత్వంలో కంటే నాణ్యమైన పౌష్టికాహారం
- గతం కంటే 70 శాతం పెరిగిన మెనూ చార్జీలు
- నాడు-నేడుతో విద్యార్థులకు శుద్ధ జలం
- ప్రతి నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణ


విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంకొండ : ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో తయారువుతున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఇంటి భోజనం మరిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తోంది. గత ప్రభుత్వం హయంలో కంటే మెరుగైన మెనూతో పాటు 70 శాతం అదనంగా విద్యార్థులకు మెనూ చార్జీలు పెరిగాయి. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధ జలం తోపాటు ఇతర వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రతిరోజు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భోజనం వడ్డిస్తుండడం గమనార్హం.

**పెరిగిన మెనూ చార్జీలతో మంచి పౌష్టికాహారం**

గత ప్రభుత్వ హయంలో కంటే ప్రస్తుత ప్రభుత్వం 70 శాతం మేరకు పెంచిన మెనూ చార్జీలతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 35,203 మంది విద్యార్థులకుగానూ 2018లో అప్పటి ప్రభుత్వం ప్రతిరోజు రూ.1,14,057 ఖర్చుచేసేది. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిరోజు రూ.3,00,540 ఖర్చు చేస్తోంది. ప్రతి రోజు విద్యార్థులకు గతంలో కంటే మెరుగైన నాణ్యమైన పౌష్టిహారం అందుతోంది.

**గతంలో సగం మంతి కూడా తినేవారు కాదు..**

గతంలో ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం తినలేక చాలా మంది పిల్లలు ఇంటిదగ్గర నుంచి క్యారియర్లు తెచ్చుకొనేవారు. ముద్ద కట్టిన అన్నం అప్పుడప్పుడు అందులోనుంచి పురుగులు, నీళ్ల సాంబారు, నాణ్యతలేని కూరలతో మధ్యాహ్న భోజనం తినలేక నానాకష్టాలు పడేవారు. చాలా మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి భోజనం క్యారియర్ల ద్వారా తెచ్చుకొని తినేవారు. స్థానికంగా ఉండే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇళ్లకు వెళ్లిపోయేవారు.

**విద్యార్థులకు శుద్ధ జలం**

గత ప్రభుత్వ హయంలో మధ్యాహ్న భోజనం చేయాలంటే ఇంటి దగ్గర నుంచి వాటర్ బాటిళ్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఉదయం నుంచి సాయం కాలం ఆ నీటితోనే గడుపుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వ హయంలో నాడు-నేడు అభివృద్ధి నిధులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రతి పాఠశాలలోనూ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలలోనే శుద్ధ జలాన్ని విద్యార్థులు తాగుతున్నారు. గతంలో మరుగుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వం మరుగుదొడ్లను ఏర్పాటు చేసింది.

**చెట్ల కింద నుంచి వంటగదుల్లోకి మారిన భోజనం తయారీ**

గతంలో చెట్ల కిందనే మధ్యాహ్న భోజనం వండేవారు. కట్టెల పొయ్యి నడుమ నానా కష్టాలు పడుతూ నిర్వాహకులు విద్యార్థులకు భోజనం వండేవారు. వర్షమెచ్చిందంటే అంతేసంగతులు. ఆ రోజు విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రతి పాఠశాలకు వంటగది సౌకర్యం కల్పించింది. ప్రతి పాఠశాలకు ఒక గ్యాస్‌స్టవ్, గ్యాస్ సిలిండర్‌ను సమకూర్చారు.

**నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణ**

గతంలో విద్యార్థులే తినలేని మధ్యాహ్న భోజనం జోలికి ఉపాధ్యాయులు అసలే వెళ్లేవారు కారు. దీనికితోడు ఉపాధ్యాయుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండేది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి పాఠశాలలోనూ నిత్యం మధ్యాహ్న భోజనం ముందుగా ఉపాధ్యాయులే రుచి చూస్తున్నారు. అందులో ఉన్న లోటుపాట్లను నిర్వాహకులకు తెలియజేసి ఆ తరువాత విద్యార్థులకు వడ్డిస్తున్నారు. పలు పాఠశాలల్లోను ఎక్కువ, తక్కువ అనే భేదం లేకుండా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే భోజనం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే భోజనం చేస్తుండడం గమనార్హం.

**గత ప్రభుత్వ హయంలో, ప్రస్తుతం ఇస్తున్న మెనూ చార్జీలు**

| విద్యార్థులు ప్రాథమిక పాఠశాల | 2018లో చార్జీలు | ప్రస్తుత చార్జీలు |
|---|---|---|
| (1నుంచి 5వ తరగతి) | రూ.2.17 | రూ. 5,88 |
| ఉన్నత పాఠశాల (6నుంచి 10వతరగతి) | రూ.3.24 | రూ. 8.57 |

**మండలవారీగా పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య, మెనూ ఖర్చు**

| మండలం | పాఠశాలల సంఖ్య | విద్యార్థుల సంఖ్య | రోజువారీ ఖర్చుమొత్తం |
|---|---|---|---|
| గుర్రంకొండ | 68 | 4295 | రూ.36,808 |
| పీలేరు | 110 | 13526 | రూ.1.15,917 |
| కలకడ | 52 | 3826 | రూ.31.641 |
| కలికిరి | 69 | 4204 | రూ.36.028 |
| కేవిపల్లె | 76 | 4200 | రూ.35,994 |
| వాల్మీకిపురం | 72 | 5152 | రూ.44.152 |


గత ప్రభుత్వ హయంలో ఇళ్ల దగ్గర నుంచే భోజనం, నీళ్ల తెచ్చుకొని తింటున్న విద్యార్థులు


ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్


విద్యార్థులకు కోడిగుడ్డు, చిక్కీలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు

**భోజనం చాలా బాగుంటుంది**



మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుంటుంది. మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనం వడ్డిస్తున్నారు. అన్నం, కూరలు రుచిగా ఉంటున్నాయి. ప్రతిరోజు కోడిగుడ్డు ఇస్తున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిక్షించిన తరువాతే మాకు భోజనం వడ్డిస్తారు. నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారు. – చంద్రహాస్, 9వ తరగతి, వాల్మీకిపురం

**వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు**



పాఠశాలలో శుద్ధ జలం విద్యార్థులకు అందుబాటులో ఉంది. గతంలో తాగునీరు ఇళ్ల దగ్గర నుంచి బాటిళ్ల ద్వారా తెచ్చుకొనే వాళ్లం. మధ్యాహ్న భోజనం చేయడానికి కూడా నీళ్లు దొరికేవి కావు. ఇప్పుడు పాఠశాలలోనే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంది. తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బంది పడడం లేదు. – జాహ్నవి, 10 వతరగతి, గుర్రంకొండ

---

## అన్ని వసతులతో

# వైఎస్సార్ జగనన్న కాలనీలు

**ఎమ్మెల్యే నవాజ్‌బాషా**


శాశ్వత నీటిసదుపాయానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు

మదనపల్లె : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఏర్పాటుచేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో ఆదర్శంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని పోతబోలు గ్రామపంచాయతీ వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో రాష్ట్ర గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యవిభాగం ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.199లక్షల వ్యయంతో శాశ్వత నీటిసదుపాయం కల్పనకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, వెలుగుచంద్ర, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ... పోతబోలు పంచాయతీలో సుమారు 200 ఎకరాల్లో స్థలసేకరణ జరిపి లేఅవుట్ ఏర్పాటుచేసి 3,188 ఇళ్లు కేటాయించామన్నారు. కాలనీలో రూ.కోటి 5లక్షలతో బోర్లు, మోటార్లు, విద్యుత్‌కనెక్షన్, పైప్‌లైన్ నిర్మాణం చేశామన్నారు. మౌలికవసతుల కల్పనలో భాగంగా జలజీవన్ మిషన్ కింద పోతబోలు లేఅవుట్‌లో ఒకొక్కటి రూ.60వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటుగా, 9కి.మీ.మేర పైప్‌లైన్, 4,000 ఇళ్లకు ప్రతి ఇంటికీ కొళాయిద్వారా నీటిసరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోతబోలు లేఅవుట్‌కు దారిసమస్య తీర్చేందుకు రూ.50 లక్షలతో టిడ్కో ఇళ్ల నుంచి వెడల్పైన రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. సర్పంచ్ ఈశ్వరయ్య, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అబ్దుల్‌మతీస్, డీఈ సురేష్‌రెడ్డి, ఏఈ చందన, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పోతబోలునాగరాజ, వైస్ ఎంపీపీ నందినితాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా ఆజాదీకా కలశ యాత్ర


కలశ యాత్రలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వాల్మీకిపురం : ఆజాదీకా అమృత్ మహోత్సవ ముగింపు కార్యక్రమం సందర్భంగా కలశ యాత్ర కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కలికిరి ఐటీబీపీఎఫ్ 53వ బెటాలిన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి సేకరించిన మట్టి, ధాన్యాలను కలశంలో కలిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జడ్పీ బాలికోన్నత, పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలపించిన దేశభక్తి గేయాలు, నృత్యాలు అబ్బురపరిచాయి. ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ ఆజాదీకా అమృత్ మహోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కమాండెంట్ అమత్‌బాటి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు నీళ్లభాస్కర్, వెంకటరమణ, మహబూబ్‌బాషా, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఐటిబిపిఎఫ్ సిబ్బంది, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

రామసముద్రం : మండలంలోని కమ్మవారిపల్లె గ్రామ పంచాయతీ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శనివారం ఎంపీడీఓ నారాయణస్వామి, ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశవర్కర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడే వారిని గుర్తించి వారికి ఇంటి దగ్గరే వైద్యం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాధర్‌నాయుడు, సర్పంచ్ ఇజ్జమ్మ, వెంకటరమణ, విజయ్, సిహెచ్ఎస్‌ఓ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీచౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు గ్రామ దేవత శ్రీచౌడేశ్వరిదేవికి తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో నూతన ఆలయం నిర్మించి మూడు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమ్మవారి మూలవిగ్రహ ప్రతిష్ట, హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అఖిలభారత తొగటవీరక్షత్రియ కులగురువు దివ్యజ్ఞానానంద గిరిస్వామి హాజరై భక్తులకు పుణ్యమార్గప్రాప్తి , ఖర్మఫలాల గురించి తెలియజేశారు. శ్రీశైవ వేదపండితులు వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహప్రతిష్ట చేయించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనివాసులు, తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు వీరాంజనేయప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శ్రీలత, వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, రామిశెట్టి రత్నమయ్య, జిల్లా రాజగోపాల్‌రెడ్డి, జివి కిషోర్, నాగమణి, మోహన్‌రాజ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గరీబ్‌నవాజ్ చట్టీ చదివింపులు

వాల్మీకిపురం : స్థానిక ప్రాచీన సయద్యా ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో శనివారం గరీబ్‌నవాజ్ చట్టీ కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం దర్గాను శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘామొహిద్దీన్ శాలువతో సన్మానించారు. అనంతరం దర్గాకు చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సందాని, నాసిర్ హుస్సేన్, అబ్దుల్ అజీమ్ సాహెబ్, మస్తాన్ సాహెబ్, గఫార్ భాయ్, జబ్బార్ సాహెబ్, జనాబ్ కరీం భాయ్, నయాజుద్దీన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలను ఎంపీపీ సాయిలీలా, సర్పంచు రహమత్‌బీ ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, సెటిల్ బ్యాట్మింటన్, యోగా పోటీలకు గాను బాల, బాలికలను ఎంపిక చేసినట్లు హెచ్ఎం క్రిష్టారెడ్డి, పీడీ సరోజమ్మ తెలిపారు. అండర్ -14, 17 బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించామని, ఎంపికైన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో అనూఖా-2323 కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి వచ్చిన విద్యార్థులు వివిధ టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ, ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్ఫోసిస్ అనాలసిస్ట్ డాక్టర్ హరీష్, షఫీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## దూదేకుల సంఘం అధ్యక్షుడిగా కరీమ్

తంబళ్లపల్లె : నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కరీమ్ నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ, జిల్లా అధ్యక్షుడు మౌలా నియామక పత్రాలను అందజేశారు. కరీమ్ మాట్లాడుతూ దూదేకుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

తంబళ్లపల్లె : విద్యార్థులు క్రమశిక్షణ పాటించి ఉన్నత ఆశయంతో ఉన్నత చదువులు చదవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఇతరులకు ఇబ్బంది కలిగే వాటిపై తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వెంకన్న పవిత్రోత్సవాలు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వెంకన్న పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఆరాధన, అంకురార్పణ కార్యక్రమంతో పవిత్రోత్సవాలను ప్రారంభించారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఆగమ అడ్వైజర్ మణికంఠబట్టాచార్యులు, ప్రధాన అర్చకులు రమేష్‌లు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు చేశారు.

## అంగన్‌వాడీల్లో నాణ్యమైన పౌష్టికాహారం

**డీపీఓ ధనలక్ష్మీ**


మర్రిపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మీ

గుర్రంకొండ : అంగన్‌వాడీ కేంద్రాలను రెగ్యులర్‌గా తనీఖీలు చేసి పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని డీపీఓ ధనలక్ష్మీ అన్నారు. శనివారం మండలంలోని మర్రిపాడులో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె స్థానిక డంపింగ్‌యార్డు, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. కొంతమంది సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ వేయకపోవడంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. సచివాయాల ఉద్యోగులు ఎక్కడికెళ్లినా ముందుగా బయెమెట్రిక్‌తో పాటు హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కచ్చితంగా సమయ పాలన పాటించాలన్నారు. ఉద్యోగులు విధుల నిమిత్తం బయటకెళ్లే సమయంలో మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరరాలు అపరిశుభ్రంగా ఉండడంతోపాటు భోజనం నాణ్యంగా లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రెగ్యులర్‌గా తనిఖీ చేపట్టాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వైరస్‌లో ఎక్కువగా ప్రబలే అవకాశమున్నందును ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, సీడీపీఓ భారతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాణి, సర్పంచ్ నందినీ, కార్యదర్శులు సుబ్బారెడ్డి, మణికుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రేపు స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణకు ఎంపిక

కలికిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు అర్హుల ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో ఎన్ఆర్ ఈజీఎస్(ఉపాధి హామీ) జాబ్ కార్డు కలిగి , ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు బీజేపీ పార్లమెంటరీ జిల్లా సమావేశం

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ బీజేపీ జిల్లా సమావేశం ఆదివారం మదనపల్లె ఎన్టీఆర్ సర్కిల్‌లోని శ్రీకృష్ణ కల్యాణమండపంలో నిర్వహించనున్నట్లు మదనపల్లె అసెంబ్లీ కన్వీనర్ పి.భగవాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ం